క్లుప్తంగా

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి



తాళ్లపూడిలో తమ గోడును మీడియాకు వివరిస్తున్న ఆటో డ్రైవర్లు

తాళ్లపూడి: ఇటీవల ప్రభుత్వం ప్రారంభించిన మహిళలకు ఉచిత బస్సు పథకం కారణంగా పరోక్షంగా ఆటోలపై తీవ్ర ప్రభావం పడుతోందని, యువశక్తి ఆటో యూనియన్ అధ్యక్షుడు కడవుల రజని కుమార్ పేర్కొన్నారు. తాళ్లపూడిలో శనివారం ఆయన మాట్లాడుతూ మహిళకు ఉచిత బస్సు పథకంతో తమ కుటుంబాలు వీధిన పడతాయని యూనియన్‌లో 250 మందికి పైగానే సభ్యత్వాలు ఉన్నాయని, 20 ఏళ్ల పై బడి కేవలం ఆటోలతో తమ జీవనం సాగిస్తున్నామని ఆర్టీసీ ఉచిత బస్సుతో ప్రత్యక్షంగా ఇరకాటంలో పడుతున్నామన్నారు. గత జగన్ ప్రభుత్వం మాదిరిగానే మంచి మనసుతో ఆలకించి ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ఆలోచన చేయాలని రూ.10 నుంచి 15 వేలు భృతి వేసి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు ఐవీరాజు, పి వెంకట రత్నం, డి సత్యనారాయణ, సీహెచ్ దుర్గారావు పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టాకు నీటి విడుదల తగ్గింపు

నిడదవోలు: రైతుల వ్యవసాయ అవసరాల నిమిత్తం జలవనరుల శాఖ ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ అధికారులు పశ్చిమడెల్టా ప్రధాన కాలువకు నీటి విడుదలను క్రమబద్ధీకరిస్తున్నారు. గత నాలుగు రోజులుగా వర్షాలు కురవడంతో రైతుల సాగునీటి అవసరాల మేరకు నిడదవోలు మండలం విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ నుంచి శనివారం 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం గోదావరి నీటి మట్టం 13.99 మీటర్లు నమోదయ్యింది. పశ్చిమడెల్టా పరిధిలో ఉప కాలువలైన నరసాపురం కాలువకు 1,142 క్యూసెక్కులు, తణుకు కాలువకు 99 క్యూసెక్కులు, ఏలూరు కాలువకు 496 క్యూసెక్కులు, ఉండి కాలువకు 100 క్యూసెక్కులు, అత్తిలి కాలువకు 88 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నామని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లజర్ల: అయ్యవరం సబ్ స్టేషన్‌లో మరమత్తులు చేపట్టనున్న దృష్ట్యా అయ్యవరం, టవర్ ఫీడర్‌ల పరిధిలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణ అప్పారావు ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమినించాలని కోరారు.

దేవరపల్లిలో..

దేవరపల్లి: పల్లంట్ల 33/11 కేవీ సబ్ స్టేషన్ 11 కేవీ చిక్కాల ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు పనుల నిమిత్తం ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ ఆపరేషన్ నిడదవోలు ఈఈ ఎస్. నారాయణ అప్పారావు తెలిపారు. ఈ మేరకు పల్లంట్ల, లక్ష్మీపురం, చిక్కాల గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు. ఉదయం 3 గంటల నుంచి 7 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా ఉంటుందన్నారు.

అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి



ఆటోలకు అనుమానితుల ఫొటోలను అతికిస్తున్న సీఐ తిలక్

నిడదవోలు: అనుమానిత వ్యక్తుల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని నిడదవోలు సీఐ పీవీజీ తిలక్ సూచించారు. పట్టణంలోని శనివారం గణపతి జంక్షన్‌లో ఆయన అనుమానిత వ్యక్తుల ఫొటోలతో ఉన్న స్టిక్కర్లను ఆటోలకు అతికించారు. ఆటోలో ప్రయాణిస్తున్న సమయంలో ప్రయాణికులతో పరిచయం పెంచుకుని విలువైన బంగారం, నగదు, సెల్ ఫోన్లు ఇతరత్రా విలువైన వస్తువులను దొంగతనం చేసే నిందితుల పేర్లు ఫొటోలతో ఆటోలపై అంటిస్తున్నామన్నారు. ఏవరిపైనా అనుమానం వస్తే సంబంధిత పోలీస్ స్టేషన్లకు సమాచారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సై జగన్మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ పెన్షన్ బకాయిలు చెల్లించాలి



జేమ్స్

నల్లజర్ల: రిటైర్డు ఉద్యోగుల సంఘం నల్లజర్ల శాఖ నూతన కార్యవర్గాన్ని సభ్యులు శనివారం ఎన్నుకున్నారు. నల్లజర్లలో మండలశాఖ అధ్యక్షుడు ఐ.వీ.సత్యం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గౌరవ అధ్యక్షుడుగా ఉన్నమట్ల వెంకటేశ్వరావు, ప్రధాన కార్యదర్శి ఐడీవీ అప్పారావు, తదితర సభ్యులు ఎంపికయ్యారు. అనంతరం ఉపాధ్యక్షుడు జి.జేమ్స్ మాట్లాడుతూ పెన్షనర్ల పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని, ఆరోగ్యకార్డులపై నగదు రహిత వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బినామీ మస్తర్లకు చెక్

- కూలీలకు ముఖ ఆధారిత హాజరు విధానం
- రోజుకు రెండు ఫొటోలు తీయాల్సిందే
- నాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్ల గుండెల్లో గుబులు



డి.ముప్పవరంలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు



నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం యాప్

నిడదవోలు రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో పారదర్శకతకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. క్షేత్రస్థాయిలో పనుల్లో జరిగే అవినీతికి చెక్ పెట్టెందుకు సాంకేతికతను అందిపుచ్చుకుంటోంది. ఉపాధి ఫలాలను అర్హులకు అందించాలనే సంకల్పంతో నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం(ఎన్ఎంఎస్ఎస్) పేరుతో నూతన యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ కొత్త యాప్ ద్వారా ముఖఆధారిత హాజరు విధానాన్ని ప్రారంభిస్తోంది. దీంతో బినామీ, బోగస్ మస్తర్లతో ఉపాధి నిధుల స్వాహాకు చెక్ పడనుంది. ఉపాధి హామీ పథకంలో బోగస్, బినామీ మస్తర్లతో కూటమి నాయకులతో కలసి క్షేత్రసహాయకులు పెద్ద ఎత్తున నిధులు స్వాహా చేస్తుండడాన్ని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా అత్యాధునిక సాంకేతికతతో ఎన్ఎంఎస్ఎస్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్‌ను గ్రామ, మండల, జిల్లా భౌగోళిక పరిస్థితిని సైతం అంచనా వేసేలా రూపొందించారు. ఇందులో గ్రామాల్లో చేపడుతున్న పనులకు సంబంధించిన ఫొటోలను ప్రతి రోజూ అప్ లోడ్ చేయాల్సి ఉంటుంది. అలాగే జాబ్‌కార్డు కలిగిన కూలీల ఫొటోలను ముందస్తుగా అప్లోడ్ చేస్తారు. ఉపాధి పనులకు కూలీలు హాజరైన సమయంలో యాప్ ద్వారా ప్రతి ఒక్కరి ఫొటో తీయాలి. ఒకవేళ యాప్‌లో నమోదు చేసిన వ్యక్తి ఫొటోతో మ్యాచ్ అవ్వకుంటే నగదు చెల్లింపులు చేసేందుకు వీలుండదు. ఈ ప్రక్రియలో ఒకరి బదులు మరొకరు పనులకు రాకుండా తోడ్పడుతుంది. అలాగే బోగస్ మస్టర్‌కు అడ్డుకట్ట వేస్తుంది.

నియోజకవర్గంలో ఉపాధి కూలీల వివరాలు..

మండలం	జాబ్‌కార్డులు	పనికివస్తున్న ఉపాధికూలీలు
నిడదవోలు	5,916	9,951
పెరవలి	4,254	6,877
ఉండ్రాజవరం	3,904	6,907

23,735 మంది ఉపాధి కూలీలు

నియోజకవర్గ పరిధిలోని నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల్లో 14,074 జాబ్ కార్డులు ఉండగా, వీటి పరిధిలో 23,735 మంది ఉపాధి కూలీలు ఉన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో నిడదవోలు మండలంలోని తాళ్లపాలెం, శెట్టిపేట గ్రామాల్లో ప్రయోగాత్మకంగా ఈ యాప్ ద్వారా పనులు చేపట్టారు. అంతేగాక ఉపాధిహామీ ఏపీఓలు పనులు జరిగే ప్రాంతాల్లో కూలీలకు యాప్‌పై అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపడుతున్నారు.

హాజరు నమోదు ఇలా..

ఉపాధి కూలీల హాజరు తీసుకునే విధానంలో కూలీల ఫొటోలను సెల్ ఫోన్‌లో తీసుకుని ఎన్ఎంఎస్ఎస్‌కు అనుసంధానం చేయాల్సి ఉంటుంది. పని ప్రదేశంలో రెండు సార్లు ఫీల్డ్ అసిస్టెంట్లు ఫొటోలను తీసి అప్ లోడ్ చేయాలి. ఈ సమయంలో ఒకరికి బదులు మరొకరు హాజరు చూపితే ఆన్‌లైన్లో కూలీల హాజరు తీసుకోదు.

రోజుకు రెండు సార్లు

ఉపాధి పనులకు కూలీలు హాజరైన సమయంలో మొదటి ఫొటోను ఉదయం 6 గంటలకు తీసి, అప్ లోడ్‌చేస్తే నాలుగు గంటలు తరువాత అంటే ఉదయం 10 గంటలకు మరోసారి ఫొటోను అప్ లోడ్ చేయాలని సిగ్నల్ వస్తుంది. ఉదయం 6 గంటలకు తీసిన ఫొటోతో పాటు 10 గంటలకు తీసిన ఫొటోను అప్లోడ్ చేయాలి. అలా చేయకపోతే ఆ రోజు కూలీలకు నగదు చెల్లింపులు ఉండవు. గతంలో కూలీలు పనులకు రాకపోయినా మస్తర్లు వేయడం, తమ బంధువుల పేర్లు నమోదు చేసి వారు పనులకు రాకపోయిన నగదు తీసుకుంటూ దోచుకున్న ఘటనలు అనేకం ఉన్నాయి. కొత్తయాప్‌లో వాటికి గండి పడే పరిస్థితి కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పార్టీల నాయకులు తమకు అనుకూలంగా లేకపోతే ఫీల్డ్ అసిస్టెంట్‌లుగా తొలగిస్తామని బెదిరించి తమకు నచ్చిన విధంగా ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడేవారు. ఈ నేపథ్యంలో యాప్‌ను తీసుకురావడంతో వారి గొంతులో పచ్చివెలక్కాయ పడినట్టలైంది.

అవగాహన కల్పిస్తున్నాం..



ప్రతి గ్రామానికి వెళ్లి ఉపాధిహామీ కూలీలకు కొత్త విధానాలపై సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం. రోజుకు రెండు ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. మస్టర్‌లో పేరు ఉన్నవారే పనులు చేయాలి. వేరే వాళ్ల పని చేస్తే నగదు రాదు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు బాధ్యతగా పనిచేయడంతో పాటు రెండు సార్లు తీసిన ఫొటోలు కచ్చితంగా ఆన్‌లైన్ చేయాలి. ఈ యాప్‌తో పనుల్లో అవకతవకలు నిరోధించేందుకు దోహదపడుతుంది.

– ఏపీవీ సత్యనారాయణ, ఏపీఓ, నిడదవోలు మండలం.

ప్రతి ఇంటిని మోసం చేశారు

- మాజీ హోంమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు తగవు
- మంచితనాన్ని అలుసుగా తీసుకుంటున్నారా?
- నల్లజర్ల వైఎస్సార్ సీపీ నాయకుల సవాల్



నల్లజర్లలో విలేకర్లతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నల్లజర్ల: మాజీ హోంమంత్రి తానేటి వనితపై టీడీపీ యూత్ నాయకులు సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, పోస్టులు పెట్టడం తగదని నల్లజర్ల మండల వైఎస్సార్ సీపీ శ్రేణులు హెచ్చరించారు. మండల పార్టీ అధ్యక్షుడు వెల్లంకి వెంకటసుబ్రమణ్యం ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ హోంమంత్రి తానేటి వనితపై నల్లజర్లకు చెందిన సవలం రామకృష్ణ, మద్దిపాటి మహేష్, దేవరపల్లి మండలానికి చెందిన నగ్గిన నాగేంద్రలు ఫేస్‌బుక్‌లో అనుచిత పోస్టులు పెట్టడం, ఏకవచనంతో సంబోదిస్తూ, వ్యంగంగా కించపరుస్తూ పోస్టులు పెట్టారన్నారు. ఈ సంస్కృతి మంచిదికాదని కూటమి నాయకులను ఈ సందర్భంగా హెచ్చరించారు. వ్యక్తిగత దూషణలు, కక్షలకు పాల్పడం కూటమికే నష్టమన్నారు. మేం సంయనం పాటిస్తుంటే చేతగాని తనం అనుకోవద్దన్నారు. మా కార్యకర్తలు దేనికైనా సిద్ధంగానే ఉన్నారన్నారు.

టీడీపీ నాయకుల కపట ప్రేమ

దూబచర్లలో కొబ్బరి బోండాల వ్యాపారి పెద్దిరాజు ఆత్మహత్యకు టీడీపీయే కారణమన్నారు. ఆసుపత్రికి తానేటి వనితతో తామంతా వెళ్లి వైద్యం జరుగుతున్న తీరును తెలుసుకొని ధైర్యం చెప్పామన్నారు. ఏరోజు ఆ వ్యక్తి ఛాయలకు కూడ రాని టీడీపీ నాయకులకు అతను మరణించిన అనంతరం కుటుంబంపై ఎనలేని ప్రేమ పెరిగిపోయిందని చివర్లో వచ్చి హాడావిడి చేశారన్నారు. మాజీ జెడ్పీటీసీ సభ్యులు బంక అప్పారావు మాట్లాడుతూ బడుగు,బలహీన వర్గాలకు ఎక్కడ అన్యాయం జరిగినా అండగా ఉండాల్సిన మీరు వారిపై దాడులు, దౌర్జన్యాలు చేయడం దారుణమన్నారు.

బహిరంగ చర్చకు సిద్ధమా

నియోజకవర్గ యూత్ విభాగం అధ్యక్షుడు నక్కా పండు మాట్లాడుతూ మండలంలో గత, ప్రస్తుత ప్రభుత్వాల ఏడాది పాలనపై బహిరంగంగా చర్చిద్దాం రమ్మని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో సూర్య చంద్రరావ,అప్పసాని నారాయుడు, సయ్యద్‌మునాఫ్, అందుగుల వెంకటేశ్వరావు, పిచ్చుకుల ప్రసాద్,చిన్నీనాగూయాదవ్, ఆదిత్య, చెల్లారి రామశ్రీనివాస్, సన్యాసినాయుడు, సాంబశివ నాయుడు, నీలపాల శివరాజు, మహేష్, తదిరులు పాల్గొన్నారు.

కృష్ణాష్టమి సందడి

నల్లజర్ల: సమస్త సృష్టికి మూలమైన శ్రీకృష్ణుడు జన్మించిన పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం మండలం వ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలు భక్తి శ్రద్ధలతో, ఉత్సాహంగా నిర్వహించారు. ఈ శుభ సందర్భంగా పలు గ్రామాల్లో కృష్ణమందిరాలు సందడిగా మారాయి. ఆలయాల్లో పూజలు సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా చేపట్టారు. కృష్ణాష్టమి రోజున చిన్నపిల్లల సందడి అంతా ఇంత కాదు. కృష్ణుడి, గోపికమ్మల వేశధారణలో అకట్టుకున్నారు. ఈ మేరకు నల్లజర్లలో వేణుగోపాలస్వామి ఆలయం, అనంతపల్లిలో రుక్మిణి, సత్యభావ సమేత మదనగోపాల స్వామి ఆలయం, సుభద్రపాలెంలో శ్రీ కృష్ణుని ఆలయంలో విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు జరిగాయి. తమ పిల్లల్ని చిన్నికృష్ణులు, గోపికలుగా అలంకరించి తల్లిదండ్రులు మురిసిపోయారు. పలుచోట్ల ఉట్టి కొట్టాడానికి యువత ఉత్సాహం చూపారు.

తాళ్లపూడి: మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో శనివారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. తాళ్లపూడిలోని రుక్మిణీ సత్యభామ సమేత మదనగోపాల స్వామి ఆలయంలో వేకువజాము నుంచే ఆలయ అర్చకులు గోవర్ధనం రాజగోపాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అన్నదేవరపేటలోని బీసీ కాలనీ, గజ్జరంలో వడ్డీల రామాలయం వద్ద ఉత్సాహంగా యువకులు ఉట్టి కొట్టారు.

తాళ్లపూడి ఇస్కాన్‌లో..

తాళ్లపూడిలోని ఇస్కాన్ అవుట్ పోస్ట్ ఆలయంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశ్యామాంగ శ్రీనివాస్ దాస్ ప్రభూజీ ఆధ్వర్యంలో శ్రీ జగన్నాథబలదేవ, సుభద్రలకు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రీ కృష్ణ లీలా ప్రవచనం, హరి నామ సంకీర్తన, మహాఅన్నప్రసద వితరన చేశారు.

కనుల పండుగగా వేడుకలు



రాధాకృష్ణుల అలంకరణలో చిన్ని కృష్ణులు, గోపికలు



ప్రతేక అలంకరణలో దర్శనమిస్తున్న శ్రీ జగన్నాథ, బలదేవ సుభద్ర అమ్మవారు

నిడదవోలు రూరల్: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిడదవోలు మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సింగవరంలోని చిన రామాలయం వద్ద శ్రీరుక్మిణి సత్యభామ సమేత మురళీకృష్ణ స్వామి ఆలయంలో పొన్నా కృష్ణబాబు, నర్సమాంబ దంపతులచే ప్రత్యేక పూజలు చేశారు. విష్ణు సహస్రపారాయణ కార్యక్రమాలు జరిపించారు. అర్చకులు వాడపల్లి కిరణ్ ఆచార్యులు, పొన్నా కృష్ణవేణమ్మ పాల్గొన్నారు.

వాడవాడలా వేడుకలు

దేవరపల్లి: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శనివారం భక్తులు వాడవాడలా ఘనంగా నిర్వహించారు. గీతా మందిరాలు, శ్రీకృష్ణుడి ఆలయాలు, దేవరపల్లిలోని రాధాగోపీనాథ్, బీసీ కాలనీలోని శ్రీకృష్ణుడి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు రాధాకృష్ణులకు పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమానిన్ని నిర్వహించారు. ఉట్టికొట్టిన యువకులకు ఆలయ నిర్వహకులు బహుమతులు అందజేశారు.

యాదవ సంఘం ఆధ్వర్యంలో

చాగల్లు: మండలంలోని కృష్ణాష్టమి వేడుకలను శనివారం ప్రజలు భక్తి శ్రద్ధలతో వేడుకగా జరుపుకున్నారు. చాగల్లు సెంటర్లోని వేణుగోపాలస్వామి వారి ఆలయంలో యాదవసంఘం ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిండుంగొయ్యి రామాలయం వద్ద, వానవయ్యిపేటలోని వేణుగోపాలస్వామి వారి ఆలయంలోను, మెయిన్ రోడ్డుపైన ఉన్న పేపర్లవారి గుడి వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని కన్నుల విందుగా చేపట్టారు. ఊనగట్ల వేణుగోలస్వామి ఆలయం, చిక్కాల వేణుగోపాలస్వామి ఆలయంలోను జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు.

నగదు బహుమతులు పంపిణీ

గోపాలపురం: గోపాలపురం కృష్ణాలయం వద్ద శనివారం చిన్నారులతో విభిన్న వేషదారణలు ప్రదర్శించారు. అనంతరం నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో యువత పోటీ పడి ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు ఆలయ కమిటి చిన్నారులకు రూ 1,116, పెద్దలకు రూ.10,116 నగదు బహుమతులను అందజేశారు. మండలంలోని దొండపూడి, చిట్యాల, పెద్దాపురం, జగన్నాధపురం, కరిచర్లగూడెం, గుడ్డిగూడెం గ్రామాల్లో యాదవ సంఘాల ఆధ్వర్యంలో కృష్ణాష్టమి ఉత్సవాలు వైభవోపేతంగా నిర్వహించారు.



దేవరపల్లి బీసీ కాలనీ కృష్ణుడి ఆలయంలో ఉట్టి కొడుతున్న యువకులు



గోపాలపురంలో ఉట్టికొడుతున్న యువకులు

ఉత్తమ సేవలకు పురస్కారాలు





ఉత్తమ సేవా అవార్డు అందుకుంటున్న సునీత, గీతాంజలి

చాగల్లు: కొవ్వూరు సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎం.సునీత విధి నిర్వహణలో చక్కటి ప్రతిభ కనపరచినందుకు ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో కలెక్టర్ ప్రశాంతి, మంత్రి దుర్గేష్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

ఉత్తమ సేవకు గుర్తింపు

నిడదవోలు: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల హెచ్ఎం బట్టు గీతాంజలికి ఉత్తమ ప్రిన్సిపాల్ పురస్కారం లభించింది. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో విధి నిర్వాహణలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను రాష్ట మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదగా ఆమె పురస్కారాన్ని అందుకున్నారు.

మరింత శ్రమించాలి

నల్లజర్ల: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన పోతవరం పీహెచ్‌సీ ఏఎన్ఎం పి.ధనలక్ష్మికి ఉత్తమ ఏఎన్ఎంగా మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నట్టు పీహెచ్‌సీ డాక్టరు సిరాజుద్దీన్ తెలిపారు. ఏడాది కాలంగా ధనలక్ష్మి అందించిన సేవలకు ఈ పురస్కారం లభించిందన్నారు.ఈ సందర్భంగా ఆమెను గ్రామ సర్పంచ్ లక్ష్మణరావు, ఎంపీటీసీలు పాపానాగేశ్వరావు, చిడిపి చింతయ్య, డాక్టరు సిరాజుద్దీన్‌తో పాటు సిబ్బంది శనివారం అభినందించారు.

ఓపీలు పెరిగేందుకు కృషి చేయాలి

గోపాలపురం: వైద్య సిబ్బంది సమయపాలన పాటించి, రోగుల పట్ల అమర్యాదగా ప్రవరిస్తే సహించేదిలేదని కొవ్వూరు డిప్యూటి డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ జే సంధ్య సిబ్బందిని హెచ్చరించారు. ఈ మేరకు మండలంలోని హుకుంపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రి ఓపీల సంఖ్య పెరిగే విధంగా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించి తగిన సూచనలు సలహాలను అందజేశారు. ఆమె వెంట డాక్టర్ శ్రీలత, రాధామణి, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు డైరీల పంపిణీ

గోపాలపురం: మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని వాదాలకుంట గ్రామంలో విద్యార్థులకు డైరీలు పంపిణీ చేశారు. దాత వాసిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ చిన్న నాటి నుంచి ఆటపాటలతో పాటు విద్యపై విద్యార్థులు దృష్టి సారించాలని అప్పుడే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. తన తండ్రి జ్ఞాపకార్థం డైరీలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, కె.కీర్తికుమార్, నెల్లి చంద్రశేఖర్, జుత్తిగ సూర్యచంద్రం సభ్యులు పాల్గొన్నారు.

పట్టణంలో పడకేసిన పారిశుధ్యం



రెండో వార్డులో వర్షానికి రోడ్డుపై చేరిన సిల్ట్

తాళ్లపూడి(కొవ్వూరు): కొవ్వూరు మున్సిపాలిటి పరిధిలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. పలు కౌన్సిల్ సమావేశాల్లో సభ్యులు దీనిపై నిలదీసిన చర్యలు మాత్రం చేపట్టడం లేదు. దీనికి తోడు అధికారుల నిర్లక్ష్యం కారణంగా పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీలు పూర్తిగా నిర్వీర్యం చేయడంతో పాటు డ్రైయిన్‌లో పూడికలు తీయకపోవడంతో వర్షానికి పొంగి సిల్ట్ రోడ్డుపైకి చేరుతుంది. శనివారం కురిసిన భారీ వర్షానికి పలు రోడ్లపై బురద పేరుకుపోయి అపరిశుభ్రంగా మారడంతో పట్టణ ప్రజలు అవస్థలు పడుతున్నారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తికి ఇది మరింత ఉతమిస్తోందని భయాందోళనకు గురవుతున్నారు. రెండో వార్డు శ్రీరామ్ కాలనీ, సహ పలు వార్డుల్లో ఇదే సమస్య నెలకొందని వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



వరలక్ష్మీ వ్రత పూజలో పాల్గొన్న మహిళలు

నల్లజర్ల: దానదర్మ చారిటబుల్ ట్రస్ట్, వేదసంకల్ప సేవ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో పుల్లలపాడు దళితవాడలో శనివారం సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. స్థానిక రామాలయం వద్ద వేదపండితులు అరిపిరాల రువద్రమూర్తి ఆధర్యంలో నిర్వహించిన వ్రతాలలో 30 మంది మహిళలు ఈ వ్రతాలలో పాల్గొని సంప్రదాయ పద్ధతిలో వ్రతాన్ని ఆచరించారు. మహిళలకు పసుపు,కుంకుమలతో పాటు చీర,జాకెట్,పూజా సామాగ్రి అందించారు. ట్రస్టు ప్రతినిధులు మాట్లాడుతూ సామూహిక వ్రతాలు సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యం విస్తరించేందుకు దోహదం చేస్తాయన్నారు.

వేదశాస్త్ర పండితులకు సన్మానం

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న శ్రీ కోటసత్తెమ్మ ఆలయ ప్రాంగణంలో వేదశాస్త్ర పండితులకు సన్మాన సభ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ ఆధ్వర్యంలో పండితులను ఘనంగా సన్మానించి నగదు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ప్రధాన అర్చకులు అప్పారావు శర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.